ముంబై మహాన్

రెండో సారి డబ్ల్యూపీఎల్ టైటిల్ కైవసం • ఫైనల్లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై అద్భుత విజయం

ముంబై ఇండియన్స్ మళ్లీ మెరిసింది! మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో రెండో టైటిల్‌ను ఖాతాలో వేసుకుని తమకు తిరుగులేదని నిరూపించింది. సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటుతూ ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన ఫైనల్లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై అద్భుత విజయం సాధించింది. సహచర బ్యాటర్లు విఫలమైన చోట కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడుతూ హర్మన్‌ప్రీత్‌కౌర్ అర్ధసెంచరీతో చెలరేగగా ముంబై పోరాడే స్కోరు అందుకుంది. లక్ష్యఛేదనలో ముంబై బౌలర్ల ధాటికి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయిన ఢిల్లీ వరుసగా మూడోసారి టైటిల్ చేజార్చుకుని రన్నరప్‌తో సరిపెట్టుకుంది. కాప్, రోడ్రిగ్స్ పోరాడినా ఫలితం లేకపోయింది. మూడు సీజన్లలో రెండోసారి టైటిల్ విజేతగా నిలిచిన ముంబై సంబురాల్లో మునిగిపోయింది.

ముంబై: డబ్ల్యూపీఎల్ మూడో సీజన్‌లో ముంబై ఇండియన్స్ టైటిల్ విజేతగా నిలిచింది. ఆదివారం బ్రబౌర్న్ స్టేడియం వేదికగా కడదాకా ఉత్కంఠ రేపిన మ్యాచ్‌లో ముంబై 8 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకుంది. తొలుత టాస్ గెలిచిన ఢిల్లీ..ముంబైని బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్(44 బంతుల్లో 66, 9ఫోర్లు, 2సిక్స్‌లు), నాట్‌సీవర్ బ్రంట్(30) రాణించడంతో ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 149/7 స్కోరు చేసింది. 14 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన ముంబైని కౌర్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆదుకుంది. కాప్(2/11), జొనాసెన్(2/26), చరణి(2/43) రెండేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ఢిల్లీ 20 ఓవర్లలో 141/9 స్కోరుకు పరిమితమైంది. మారిజానె కాప్(26 బంతుల్లో 40, 5ఫోర్లు, 2సిక్స్‌లు), జెమీమా రోడ్రిగ్స్(30) పోరాడారు. బ్రంట్(3/30) మూడు వికెట్లతో ఢిల్లీ పతనాన్ని శాసించగా, కెర్(2/25) రెండు వికెట్లు పడగొట్టింది. కౌర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

కౌర్ కెప్టెన్ ఇన్నింగ్స్: హర్మన్‌ప్రీత్‌కౌర్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో కదంతొక్కింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ముంబైని కాప్ ఆదిలోనే కోలుకోలేని దెబ్బ కొట్టింది. లీగ్‌లో సూపర్ ఫామ్‌మీదున్న మాథ్యూస్(3)ను కాప్ క్లీన్‌బౌల్డ్ చేసి ఢిల్లీకి అదిరిపోయే ఆరంభాన్నిచ్చింది. వాబుల్ సీమ్‌ను సరిగ్గా అర్థం చేసుకోని మాథ్యూస్ తొలి వికెట్‌గా వెనుదిరిగింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన సీవర్ బ్రంట్..డబ్ల్యూపీఎల్‌లో వెయ్యి పరుగుల మార్క్ అందుకున్న తొలి బ్యాటర్‌గా నిలిచింది. కాప్ బౌలింగ్‌లో షాట్ ఆడబోయిన యస్తికా(8) రెండో వికెట్‌గా పెవిలియన్ చేరడంతో ముంబై 14 పరుగులకే ఓపెనర్లను కోల్పోయింది. ఈ తరుణంలో బ్రంట్‌కు కౌర్ జత కలువడం ఇన్నింగ్స్ గతిని మార్చేసింది. పవర్‌ప్లే ముగిసే సరికి ముంబై 2 వికెట్లకు 20 పరుగులు చేసింది. కట్టుదిట్టమైన బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ కౌర్, బ్రంట్ సింగిల్స్‌తో ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. చరణి 9వ ఓవర్‌లో బ్రంట్ రెండు ఫోర్లతో దూకుడు కనబర్చగా, సదర్లాండ్ 10వ ఓవర్‌లో కౌర్ ఓ సిక్స్, ఫోర్‌తో తానేం తక్కువ కాదని చూపెట్టింది. జొనాసెన్ మరుసటి ఓవర్‌లోనైతే కౌర్ హ్యాట్రిక్ ఫోర్లతో దుమ్మురేపింది. బౌలర్ ఎవరన్నది లెక్కచేయని కౌర్ 33 బంతుల్లో ఓ ఫోర్‌తో అర్ధసెంచరీ మార్క్ అందుకుంది. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని చరణి విడగొట్టింది. దీంతో మూడో వికెట్‌కు 89 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఓవైపు వికెట్లు పడుతున్నా...కౌర్ జోరు తగ్గలేదు. జొనాసెన్ బౌలింగ్‌లో కెర్(2), సంజన(0) ఔటయ్యారు. వీరిని అనుసరిస్తూ సదర్లాండ్‌కు కౌర్ వికెట్ సమర్పించుకుంది. ఆఖర్లో బౌండరీలు రావడంతో ముంబైకి పోరాడే స్కోరు దక్కింది.

సంక్షిప్త స్కోర్లు:
ముంబై: 20 ఓవర్లలో 149/7(కౌర్ 66, బ్రంట్ 30, కాప్ 2/11, జొనాసెన్ 2/26), **ఢిల్లీ:** 20 ఓవర్లలో 141/9(కాప్ 40, రోడ్రిగ్స్ 30, బ్రంట్ 3/30, కెర్ 2/25)

ఢిల్లీ పోరాడినా: లక్ష్యఛేదనలో ఢిల్లీ పోరాడినా ఫలితం దక్కలేదు. మంచి ఫామ్‌మీదున్న కెప్టెన్ మెగ్ ల్యానింగ్(13), షెఫాలీవర్మ(4) ఘోరంగా నిరాశపరిచారు. బ్రంట్ బౌలింగ్‌లో ల్యానింగ్ తొలి వికెట్‌గా వెనుదిరిగింది. మరోవైపు షెఫాలీ..ఇస్మాయిల్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా ఔట్ కావడంతో 17 పరుగులకు ఓపెనర్లు పెవిలియన్ చేరారు. జొనాసెన్(13), సదర్లాండ్(2) వెంటవెంటనే ఔటయ్యారు. ఈ దశలో రోడ్రిగ్స్, కాప్ ఇన్నింగ్స్‌ను గాడిలో పడేశారు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 22 పరుగులు జత చేశారు. ఇన్నింగ్స్ కుదురుకుంటున్న తరుణంలో రోడ్రిగ్స్ ఔట్ కావడంతో ఢిల్లీ అవకాశాలను దెబ్బతీసింది. ఆఖర్లో కాప్, నికీ ప్రసాద్(25 నాటౌట్) గెలిపించేందుకు ప్రయత్నం చేసినా ఢిల్లీ ఒడ్డున పడలేకపోయింది.

ఎమర్జింగ్ ప్లేయర్: అమన్‌జ్యోత్‌కౌర్
పర్పుల్ క్యాప్: అమెలియా కెర్ (18 వికెట్లు)
ఆరెంజ్ క్యాప్: సీవర్ బ్రంట్ (523 రన్స్)
విలువైన ప్లేయర్: బ్రంట్

ప్రైజ్‌మనీ: విజేత:	రన్నరప్:
ముంబై (6 కోట్లు)	ఢిల్లీ (3 కోట్లు)

ఒలింపిక్ విజేతగా అనుభూతే వేరు: కోహ్లీ

బెంగళూరు: ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్‌లో క్రికెట్ చేర్చడం మంచి పరిణామమని రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ అభిప్రాయపడ్డాడు. 1900 తర్వాత రానున్న లాస్‌ఎంజిల్(2028) ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను ప్రవేశపెట్టిన నేపథ్యంలో కోహ్లీ స్పందించాడు. శనివారం ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో అతను మాట్లాడుతూ 'ఒలింపిక్ చాంపియన్‌గా నిలువడమనేది మరిచిపోలేని అనుభూతి. విశ్వక్రీడల్లో క్రికెట్‌ను చేర్చడానికి ఐపీఎల్ ఎంతగానో దోహదపడింది. ఐపీఎల్ ప్రపంచంలోనే ప్రముఖ లీగ్‌గా వెలుగొందుతూ ఒలింపిక్స్ స్థాయికి చేరడంలో కీలకమైంది. ఒలింపిక్స్‌లో పతకం సాధించేందుకు యువ క్రికెటర్లకు మంచి అవకాశం' అని అన్నాడు. తన రిటైర్మెంట్‌పై వస్తున్న ఊహాగానాలకు విరాట్ కోహ్లీ చెక్ పెట్టాడు. 'ఏం నిరుత్సాహ పడకండి. రిటైర్మెంట్‌పై నేను ఎలాంటి ప్రకటన చేయడం లేదు. ప్రస్తుతానికి బాగుంది' అని పేర్కొన్నాడు.

నితీశ్‌కుమార్ ఫిట్

బెంగళూరు: సన్‌రైజర్స్ హైదరాబాద్(ఎస్‌ఆర్‌హెచ్) ఫ్యాన్స్‌కు శుభవార్త. స్టార్ ఆల్‌రౌండర్ నితీశ్‌కుమార్ రెడ్డి పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. గత జనవరి నుంచి పక్కటెముకల గాయం నుంచి బాధపడుతున్న నితీశ్ అన్ని ఫిట్‌నెస్ పరీక్షలు పాసయ్యాడు. ఇన్ని రోజులు బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పునరావాసం పొందిన నితీశ్..అక్కడి ఫిజియోలు జరిపిన యోయో టెస్టుతో పాటు పలు టెస్టులను పూర్తి చేశాడు. దీంతో రానున్న ఐపీఎల్ సీజన్‌లో ఈ యువ ఆల్‌రౌండర్ ఆడేందుకు లైన్‌క్లియర్ అయ్యింది. త్వరలో నితీశ్..ఎస్‌ఆర్‌హెచ్‌తో కలిసే అవకాశముంది. గత సీజన్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో సత్తాచాటిన ఈ తెలుగు క్రికెటర్ 13 మ్యాచ్‌ల్లో 303 పరుగులు సాధించాడు. దీంతో వేలంలో 6 కోట్లకు ఎస్‌ఆర్‌హెచ్ తిరిగి దక్కించుకున్న సంగతి తెలిసిందే. సన్‌రైజర్స్ తమ తొలి మ్యాచ్‌లో ఈనెల 23న రాజస్థాన్ రాయల్స్‌తో తలపడుతుంది.

పునర్‌వైభవం దక్కేనా?

మరో 6 రోజుల్లో

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం: రాజస్థాన్ రాయల్స్..పేరుకు తగ్గట్లే ఐపీఎల్ ఆరంభ సీజన్‌లో చాంపియన్‌గా నిలిచిన టీమ్. అందరి అంచనాలను తలక్రిందులు చేస్తూ షేన్‌వార్న్ సారథ్యంలో 2008లో తొలి టైటిల్‌ను రాయల్‌గా ముద్దాడింది. అయితే గడిచిన 17 సీజన్లలో రాజస్థాన్ మళ్లీ చాంపియన్‌గా నిలువలేకపోయింది. 2022లో రన్నరప్ మినహా తిరిగి ఫైనల్ పోరులో నిలిచింది లేదు. అలా అనీ ప్రతిభ కల్గిన ప్లేయర్లకు జట్టులో కొదువలేదు. కానీ కావాల్సిందల్లా సమిష్టితత్వం. వ్యక్తిగతంగా కొంతమంది క్రికెటర్లు రాణిస్తున్నా..సమిష్టితత్వం లోపించడమే ఆ జట్టు టైటిల్ కలను దూరం చేస్తున్నది. ఇటీవల జరిగిన ఐపీఎల్ మెగా వేలంలో బట్లర్, చాహల్, బౌల్ట్ లాంటి క్రికెటర్లను వదులుకున్న రాయల్స్ రానున్న సీజన్ కోసం సమాయత్తమవుతున్నది. కుమార సంగక్కర స్థానంలో చీఫ్‌కోచ్‌గా వచ్చిన రాహుల్ ద్రవిడ్ మార్గనిర్దేశకత్వంలో తిరిగి గాడిలో పడేందుకు రాజస్థాన్ ప్రణాళికలు రచిస్తున్నది. గత ఏడు సీజన్లు రాయల్స్‌కు ప్రాతినిధ్యం ఇంగ్లండ్ హార్డ్‌హిట్టర్ బట్లర్ లేని లోటు రాయల్స్‌లో స్పష్టంగా కనిపిస్తున్నది. తనదైన రోజున ఒంటిచేత్తో మ్యాచ్ గతిని శాసించే సత్తా ఉన్న బట్లర్‌కు వదులుకున్నందుకు రాయల్స్ మూల్యం చెల్లించుకునే అవకాశముంది. ఇదిలా ఉంటే కెప్టెన్ సంజూ శాంసన్ ఫిట్‌నెస్ సందిగ్ధత నెలకొన్నది. ఆరు రోజుల వ్యవధిలో లీగ్ మొదలుకానున్న నేపథ్యంలో శాంసన్ పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తాడా లేదా అన్నది తేలాల్సి ఉంది. ఈనెల 23న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తొలి మ్యాచ్ నాటికి శాంసన్ జట్టులోకి వచ్చేది అనుమానంగానే ఉంది. శాంసన్ గైర్హాజరీలో కెప్టెన్ ఎవరన్నది తేలాల్సి ఉంది. యశస్వి జైస్వాల్, హెట్‌మైర్, జురెల్, రియాన్ పరాగ్ బ్యాటింగ్ భారాన్ని మోయాల్సి ఉంది. ఆర్చర్, మహీశ్ తీక్షణ, హసరంగ చేరికతో బౌలింగ్ ఒకింత బలంగా కనిపిస్తున్నది. రాయల్స్‌కు రెండో టైటిల్ దక్కుతుందో లేదో చూడాలి.

రాయల్స్ ప్రస్థానం:
2008: విజేత
2013, 15, 18, 24: ప్లేఆఫ్స్
2022: రన్నరప్

టెస్టు కెప్టెన్‌గా రోహిత్ కొనసాగింపు

న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీ విజయం రోహిత్‌శర్మ దశాదిశను మార్చేసిందా? అంటే అవుననే అంటున్నాయి బీసీసీఐ వర్గాలు. చాంపియన్స్ ట్రోఫీ తర్వాత వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటిస్తాడా అన్న అనుమానాలను పటాపంచలు చేసిన హిట్‌మ్యాన్..టెస్టుల్లో కెప్టెన్‌గా కొనసాగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఐపీఎల్ ముగిసిన వెంటనే జూన్ 20 నుంచి ఇంగ్లండ్‌తో మొదలుకానున్న ఐదు టెస్టుల సిరీస్‌కు రోహిత్ సారథ్యంలో భారత్ బరిలోకి దిగనుంది. ఈ విషయాన్ని బోర్డు వర్గాలు కూడా ధృవీకరిస్తున్నాయి. ఐపీఎల్ జరుగుతున్న సమయంలోనే దీనిపై ఒక స్పష్టత వచ్చే చాన్స్ ఉన్నట్లు తెలిసింది. ఇంగ్లండ్‌తో సిరీస్ ద్వారా టీమ్‌ఇండియా డబ్ల్యూటీసీ చాంపియన్‌షిప్‌ను ఆరంభించనుంది. ఆస్ట్రేలియాతో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఓటమి తర్వాత రోహిత్ టెస్టు కెప్టెన్సీపై నీలి మేఘాలు కమ్ముకున్నాయి. రోహిత్ స్థానంలో బుమ్రాకు పగ్గాలు ఇచ్చే అవకాశమున్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.